క్లుప్తంగా

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి

కుంటాల: గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. హరితహారం, పల్లెప్రకృతి, వననర్సరీల నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీవో రహీం, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ గ్రామంలో కొనసాగుతున్న సీసీరోడ్డు పనులను ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. అనంతరం ఓలాలో కంటివెలుగు శిబిరాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్యుడు దామోదర్, కార్యదర్శి రాజు, ఏఎన్ఎం సక్కుబాయి, తదితరులున్నారు.

3న వార్డు సభ

భైంసాటౌన్: మైనార్టీ సంక్షేమశాఖ ద్వారా అందిస్తున్న రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఈనెల 3న మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే వార్డుసభకు హాజరు కావాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తుదారులు ఆధార్, బ్యాంక్ పాస్‌పుస్తకం, దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

నిధులు మంజూరు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణ పరిధిలోని మసీదుల అభివృద్ధికి ఎమ్మెల్యే రేఖానాయక్ రూ.10లక్షలు మంజూరు చేశారని మైనార్టీ నాయకులు తెలిపారు. నిధులు మంజూరు చేసిన ందుకు గాను బుధవారం మైనార్టీ నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మోహిద్, అంకం రాజేందర్, ఖలీల్, కేహెచ్.ఖాన్, పుప్పాల శంకర్, పరిమి సురేశ్, మోహిన్, ఖదీర్, జుబేర్‌ఖాన్, మెహరాజ్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



అధ్యక్షుడిని సన్మానిస్తున్న సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని దివ్యగార్డెన్‌లో నిర్మల్ పట్టణ కమిటీ సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వం అందించే పథకాలు లబ్ధిదారులు పొందేలా చూస్తానన్నారు. సంఘం పట్టణ అధ్యక్షుడు చైతన్య, గౌరవ అధ్యక్షులు కిష్టయ్య, ఉపాధ్యక్షులు రమేశ్, గజేందర్, భూమేశ్, సెక్రెటరీలు నరేందర్, నర్సయ్య పాల్గొన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	20
వంకాయ	50
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	70
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : సార్
నారాయణ: వాల్తేరు వీరయ్య

ప్రారంభానికి ముందే మరమ్మతులు

- నాలుగేళ్లుగా నిరుపయోగంగా కొత్త జీపీ భవనం
- వినియోగంలోకి రాకముందే ఉరుస్తున్న స్లాబ్
- పాతభవనంలోనే కొనసాగుతున్న పంచాయతీ కార్యకలాపాలు



పాతభవనంలో ఊడుతున్న పెచ్చులు



మరమ్మతుల అనంతరం సిద్ధమైన కొత్త పంచాయతీ భవనం

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామ పంచాయతీ నూతన భవనం ప్రారంభానికి ముందే మరమ్మతులకు చేరుకుంది. దీంతో గ్రామస్తులు వినియోగంలోకి రాకముందే కొత్తభవనానికి మరమ్మతులు చేయించడం ఏంటని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 2016లో జామ్ గ్రామంలో పంచాయతీ భవనం నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.15లక్షలు కేటాయించింది.

కాంట్రాక్టర్ నాసిరకపు పనులతో..

టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేయించి చేతులు దులుపుకొన్నారు. భవనం పూర్తయిన తర్వాత స్లాబునుంచి వర్షపు నీరు లీకేజీ అవడం, ఫినిషింగ్ సరిగా లేకపోవడంతో ప్రారంభోత్సవానికి అవాంతరాలు ఎదురవుతున్నాయి. దీంతో అప్పటి సర్పంచ్ భవనంలోకి మారడానికి అంగీకరించకపోవడంతో పంచాయతీ కార్యకలాపాలను పాత భవనంలోనే నిర్వర్తిస్తున్నారు. 2019లో గెలిచిన నూతన సర్పంచ్ సైతం నూతన భవనంలోకి వెళ్లకపోవడంతో నిరుపయోగంగానే ఉండిపోయింది.

పెచ్చులూడుతున్న పాతభవనం..

కొత్త భవనం ఉరుస్తుండటంతో పాత భవనంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల పాత భవనంలో పైకప్పు పెచ్చులూడి పడిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

నూతన భవనంలోకి వెళ్లేందుకు ఏర్పాట్లు

క్రమంగా పెచ్చులూడటం ఎక్కువ కావడంతో నూతన భవనంలోకి మారేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో భాగంగా ఉపసర్పంచ్ వ్యక్తిగతంగా రూ.రెండు లక్షల వరకు ఖర్చు చేసి నూతన భవనానికి మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం భవనానికి బయట రంగులు, లోపల, పైన మరమ్మతులు చేసి సిద్ధం చేశారు. కాని కానీ మరమ్మతులకు ఖర్చు చేసిన సొమ్మును ప్రభుత్వం భరిస్తుందా..లేదా కాంట్రాక్టర్ భరిస్తాడా అని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఖర్చుల వివరాలను సిద్ధం చేసి బిల్లు పెట్టడానికే గ్రామపంచాయతీ సిద్ధమైనట్లు సమాచారం.

మరమ్మతులు చేయించారు

నూతన భవనం పైకప్పు నుంచి వర్షపునీరు లీకేజీ అవడంతో చిన్నపాటి మరమ్మతులు, మరో గదికి గోడ కట్టడం వంటి పనులు చేయించారు. ఇందుకు సంబంధించి ఇంకా బిల్లులు సమర్పించలేదు. పనులు పూర్తయ్యాక బిల్లులను పంచాయతీరాజ్ శాఖకు సమర్పిస్తాం.

- శరత్, పీఆర్ ఏఈ, సారంగాపూర్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



సీడీపీఓ సరితకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

ఖానాపూర్: చాలీచాలని వేతనంతో పని చేస్తున్న అంగన్వాడీలను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ సరితకు వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. లేబర్ కోడ్‌ల రద్దుతోపాటు మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా గుర్తించాలన్నారు. నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేసి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్లులు, టీఏ, డీఏలను చెల్లించాలని కోరారు. ఈ నెల 2, 3 తేదీల్లో కలెక్టరేట్ ముందు నిర్వహించే 36 గంటల దీక్షను జయప్రదం చేసేందుకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, తదితరులు ఉన్నారు.

ముథోల్: తమ సమస్యలను పరిష్కరించాలని బుధవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు ముథోల్ ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చచేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు హెల్త్‌కార్డుల మంజూరుతోపాటు 2017 నుంచి రావాల్సిన అలవెన్సులను చెల్లించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఐసీడీఎస్ సిబ్బందికి అందజేశారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రజియా బేగం, స్వర్ణలత, రేఖ, కవిత తదితరులు ఉన్నారు.

ప్రీతి మృతికి కారణమైన వారిని శిక్షించాలి



కుభీర్ వీధుల్లో ర్యాలీ తీస్తున్న నాయకులు



ఆదర్శనగర్‌లో మాట్లాడుతున్న నాయకులు

కుభీర్: మెడికో విద్యార్థిని ప్రీతి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని వీధుల్లో ర్యాలీ తీశారు. ఈసందర్భంగా విద్యాసంస్థలను మూసివేయించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బంజారా సేవా సంఘం నాయకులు కమలేశ్, సుదాం, అజయ్, గణపతి, బీజేపీ నాయకులు గంగాశేఖర్ ఉన్నారు.

ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో..

మామడ: వైద్యవిద్యార్థిని ప్రీతి మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి అన్నారు. మండలంలోని ఆదర్శనగర్ గ్రామంలో పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రీతి మృతిపై సిట్టింగ్ జడ్జి విచారణ జరిపి బాధ్యుల్ని శిక్షించాలన్నారు. సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి రాజన్న, పద్మ, కవిత, రాజు, గంగవ్వ, లక్ష్మి ఉన్నారు.

ఆత్మగౌరవసభకు తరలిరావాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యమ నాయకులు

కుభీర్: హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో ఈనెల12న జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం కుభీర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహానుభావుల ఆత్మబ లి దానమే నేటి తెలంగాణ అని.. ఉద్యోగాలు, చదువులు మానేసి ఉద్యమంలో పాల్గొన్న వారిని ఆదుకోవాలన్నారు. ఇప్పటికైనా వారికోసం ఉద్యమకారుల ఫోరం ఏర్పాటు చేసి విద్యా, ఉద్యోగం, ఉపాధి,రాజకీయ రంగాల్లో ప్రాధాన్యం కల్పిస్తూ వారి ఉన్నతికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముష్కం రామకృష్ణగౌడ్, కుభీర్ మండల జేఏసీ అధ్యక్షులు పుప్పాల పిరాజీ, ఉద్యమనాయకులు వి.నాగేశ్, రాజన్న, కల్యాణ్, పోశెట్టి తదితరులు ఉన్నారు.

వార్షికోత్సవం

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీకృష్ణ ఆలయ ఏడో వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. రాధాకృష్ణ ప్రతిమలకు అభిషేకం, పూజ, హరేకృష్ణ మంత్ర జాపం, విష్ణు నామసహస్రస్తోత్రం, హోమం, భగవద్గీత ప్రవచనం, భజన, కీర్తనాలు ఆలపించారు. ఎంపీపీ గజ్జారాం యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, కృష్ణరావు, వెంకట్రావు, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

ఆలయం సందర్శన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ రాధాకృష్ణ ఆలయాన్ని బుధవారం మున్సిపల్ చైర్మన్ గండత్ ఈశ్వర్ సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆలయ పునర్నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసిన ట్లు ఆలయ కమిటీకి తెలిపారు. కాంట్రాక్టర్ భాస్కర్ రావు, కాలనీవాసులు ఉన్నారు.

ఈరోజు

ఏఐఎంఐఎం ఆవిర్భావ వేడుకలు

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ పట్టణంలోని ప్రియదర్శి నినగర్‌లో గురువారం ఏఐఎంఐఎం ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నిర్మల్ అధ్యక్షులు అజీం బిన్ యాహియా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పార్టీ కార్యాలయంలో పతాకావిష్కరణ, ఉంటుందని.. ప్రజాప్రతినిధులు, పదాధికారులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

చెక్కులు పంపిణీ

తానూరు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తామని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. ఎమ్మెల్యే విఠల్ రెడి అతిథిగా హాజరవుతారని.. ఆయా గ్రామాల లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు.

ధర్నా విజయవంతం చేయాలి

నిర్మల్‌టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గృహ అవసరాల సిలిండర్ ధరలను పెంచినందుకు గురువారం జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గృహ సిలిండర్ ధర రూ.50, కమర్షియల్ సిలిండర్ ధర రూ.350 పెంచినందుకు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు స్థానిక మీనా ఇడ్లీ సెంటర్ ఎదురుగా ఉదయం 10 గంటలకు ధర్నా చేపడుతామన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చేతితోనే గొంతు తడుపుకొన్నారు



జిల్లాకేంద్రంలోని ప్రసూతి ఆస్పత్రికి వచ్చేవారి కోసం మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేశారు. కానీ నీరు తాగేందుకు గ్లాసులను ఉంచడం మరిచారు. దీంతో ఆస్పత్రికి వచ్చే వారు చేతితోనే నీటిని పట్టుకొని గొంతు తడుపుకొంటున్నారు. అధికారులు స్పందించి గ్లాసులు ఏర్పాటు చేయాలని పేషంట్లు, వారి బంధువులు కోరుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

నేడు 'డబుల్' లబ్ధిదారులకు లక్కీడ్రా

ఖానాపూర్: పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాల్‌లో గురువారం డబుల్‌బెడ్‌రూమ్ లబ్ధిదారుల ఎంపికకు లక్కీడ్రా నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ రత్నాకర్ రావు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. మంగళవారం పట్టణంలోని వార్డుల్లో గ్రామసభల్లో ప్రదర్శించిన అర్హుల జాబితాలో ఉన్నవారు ఉదయం 9 గంటలకు ఆధార్ తీసుకురావాలన్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు హాజరవుతారని వారు పేర్కొన్నారు.

'డ్రాను బహిష్కరిస్తున్నాం'

ఖానాపూర్: పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాల్లో డబుల్‌బెడ్ రూం లబ్ధిదారుల ఎంపికకు నిర్వహించే లక్కీడ్రాను ప్రతిపక్ష కౌన్సిలర్లుగా బహిష్కరిస్తున్నామని మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం అన్నారు. బుధవారం ఆయన మాట్లాడారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని సంతోశ్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్‌పాషా తదితరులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. నిర్వహణ లేక నిరుపయోగం



తానూరు: మండలంలోని హిప్నెల్లి గ్రామంలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ఐదేళ్ల కిందట ఉపాధిహామీ నిధులతో పశువుల నీటితొట్టి నిర్మించారు. కాని దీనిని వినియోగించకపోవడంతో నీటి తొట్టి పగుళ్లు బారింది. అధికారులు తొట్టికి మరమ్మతులు చేసి.. అందులో నీటిని నింపాలని రైతులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: మోహన్‌సింగ్, ఎంపీవో, ఫోన్: 98666 51826

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు



శనగ కొనుగోళ్లు ప్రారంభిస్తున్న నాయకులు

సారంగాపూర్: దళారులను ఆశ్రయించి మోసపోకుండా.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే శనగ పంట విక్రయించుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో కౌట్ల(బి) పీఏసీఎస్ ఆధ్వర్యంలో శనగ పంట కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్వింటాలు శనగకు రూ.5,335 మద్దతు ధర ఉందని.. రైతులు తమ పంటను నేరుగా మార్కెట్ యార్డుకు తరలించి విక్రయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, నర్సారెడ్డి, ముత్యం, మాధవరావు, సీఈఓ సలీం, రైతులు, తదితరులు ఉన్నారు.

'పేదలపై భారం మోపుతున్న కేంద్రం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: నిత్యావసరమైన వంటగ్యాస్ సిలిండర్ ధరలు పెంచుతూ కేంద్రప్రభుత్వం పేదలపై భారం మోపుతోందని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఆరోపించారు. ఈమేరకు బుధవారం ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పలుమార్లు సిలిండర్ ధరలు పెంచిందన్నారు. ఇటీవల ఈశాన్యరాష్ట్రాల ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే మరోమారు సిలిండర్ ధరలు పెంచడాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ధనిక వర్గాలకు లబ్ధి చేకూర్చేందుకే బీజేపీ పని చేస్తోందని విమర్శించారు. వెంటనే పెంచిన ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజన్న, కృష్ణ, ఫారూక్ అహ్మద్ ఉన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

లక్ష్మణచాంద: విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగాలని ఎంపీపీ అడ్వాల పద్మ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సహకార జూనియర్, ఎస్వీజీ డిగ్రీ కళాశాల వార్షికోత్సవానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోనే గ్రామస్తులే యజమానులుగా మారి నిర్వహిస్తున్న ఏకైక కళాశాల సహకార జూనియర్ కళాశాల అన్నారు. కేవలం నామమాత్రపు ఫీజులతోనే నాణ్యమైన విద్య అందిస్తున్నారని.. విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముత్యంరెడ్డి, తహసీల్దార్ కవితారెడ్డి, కళాశాల అధ్యక్షుడు నారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రవికిరణ్, సభ్యులు రాంరెడ్డి, వెంకట్రాంరెడ్డి, శంకర్, వెంకటరాజు, ప్రిన్సిపాల్ మహిపాల్, ఎస్‌వో నవిత తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి అడుగుజాడల్లో నడవాలి

నిర్మల్‌టౌన్: యువత స్వామి వివేకానందుడి అడుగుజాడల్లో నడవాలని రామకష్ణ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఆరె భూమన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని విజయ హైస్కూల్‌లో వివేకానందుడు ప్రపంచ విశ్వమత మహాసభల్లో ఉపన్యసించి 125 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం రామకష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, రామకష్ణ సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కోరెడ్డి లెనిన్, సంయుక్త కార్యదర్శి నెల్ల లస్మయ్య, కోఆర్డినేటర్ హన్మాండ్లు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రామానుజాచార్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు వంతెనతో ఇబ్బందులు



అర్లి వంతెనపై ఇబ్బందిపడుతున్న వాహనదారులు



నిలిచిపోయిన వాహనాలు

లోకేశ్వరం: ఎస్సారెస్పీ ముంపు గ్రామాలకు రవాణా సౌలభ్యం కోసం మండలంలోని హవర్గ గ్రామ సమీపంలో సుద్దవాగుపై 40 ఏళ్ల కిందట అర్లి వంతెన నిర్మించారు. ఈ వంతెన మీదుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బుధవారం వాహనాలు భారీగా రావడంతో వరికోత మిషన్, ట్రాక్టర్లు వంతెనపై ఇరుక్కుపోయాయి. దీంతో అరగంట సేపు ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. వంతెన శిథిలావస్థకు చేరడంతోపాటు ఇరుకుగా మారిందని.. అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మించాలని వాహనాదాలు కోరుతున్నారు.